కథానిక

# ఏకోదరుల అనురాగం

"మంజుశ్రీ"

పరంధామయ్యగారికి ప్రాణాలమీదకొచ్చిందని కబురు అందీ అందకముందే రామాపురంనుంచి రామయ్యగారూ, భీమాపురంనుంచి భీమయ్యగారూ వూడిపడ్డారు సకుటుంబ సపరివారులై. పెద్దతమ్ముడైన భీమయ్యవచ్చి మంచంమీద కూర్చునేటప్పటికి పరంధామయ్యగారు జాడ్యమంతా ఎగిరిపోయినట్లుగా కుశలప్రశ్నాదికాలు గావించారు. భీమయ్యగారిభార్యవచ్చి వెంటనే ఫ్లాస్కులోని కాఫీపోసి భీమయ్యగారి చేతి కందిచ్చింది. చెంచాతోటి చల్లగా భీమయ్యవిడుస్తుంటే కప్పుకాఫీ పరంధామయ్యగారి గళంలోకి సజావుగా జారిపోయింది. పరంధామయ్యగారు మరదలూ తమ్ముడూ తనయెడలచూపించే అనన్యమైన అపురూపమైన ప్రేమానురాగాలను చూసి తన్మయుడై చిరునవ్వు నవ్వుకున్నాడు.

ఇంతలోకే రామయ్యగారి గుర్రబ్బండీ వాకిట్లో వచ్చి నిలబడింది. రామయ్యగారి సతీమణి గంపెడు పిల్లలను దింపుకొని ఇంట్లోకి వచ్చింది. రామయ్యగారు గంపెడు బత్తాయిపండ్లు పట్టుకొని యింట్లో కొచ్చాడు. భీమయ్యన్నయ్యా పరంధామయ్యన్నయ్యా మాట్లాడుకోవటంచూసి, లేనిసంతోషం తెచ్చిపెట్టుకొని పెద్దన్నయ్యను ముందు పలకరించాడు. తరువాత చిన్నన్నయ్యే తనసంగతి చెప్పుకున్నాడు. రామయ్యగారిభార్యపోయి భీమయ్యగారి భార్యను వెంటేసుకొని వంటయింట్లో కూరతరుక్కుంటున్న పెద్దతోటికోడలును అక్కయ్యా అంటూ ఆప్యాయంగా పలకరించింది. రామయ్య రెండోకొడుకుని రెండోతోడికోడలు పుసికిపుసికి ముద్దెట్టుకుంది. అయ్యోపాపం అన్నాలు పెట్టండమ్మా పిల్లలకు అని పెద్ద తోటికోడలు హెచ్చరించింది.

* * *

రెండు గుర్రబ్బండ్లలోంచి ఇద్దరు తమ్ముళ్ళూ సకుటుంబ సపరివారులై దిగటంచూసి వూరివాళ్ళంతా వొక్కపెట్టున మూర్ఛపోయినంత ఆశ్చర్యపోయినారు. "ఇదుగో రంగయా ఎన్నతగూలొచ్చినా, ఎన్నిఏర్లుపడ్డా, కావల్సినోళ్లు కావాల్సినోళ్లే" అన్నాడు చంగయ్య. రంగయ్య బలపరిచాడు. "ఇదుగో చూడూ! రకతసంబంధ మాలాటిది. పొమ్మంటే పోతదటయ్యా, అన్నదమ్ముల మధ్యా, ఆలుమగలమధ్యా, పోట్లాటలొస్తేమటుకు కలకాలం కూకుంటవాఏంటి? కష్టాలొస్తే గమ్మున కలుస్తారు. కాసేపు కాసేపు కీసులాడుకుంటారు. ఈమద్దిన మాయింటాడది సెప్పినా యినకుండా పోట్లాటేసుకొని వాల్లూరెల్లిపోయిందా-ఏమైందనుకున్నావు? ఏడిలెగిసి జరమొస్తే, మన రత్తయ్య పోయినప్పుడు అగపడితే సెప్పినదంట! చెనం నిలిత్తే వొట్టు — ఆ యోపున్నే పడొచ్చింది. అంతేనయా—అంతే!" అన్నాడు రంగయ్య. రచ్చబండకింద ఆ సాయంత్రం మాలావు జోరుగా యీ ముగ్గురు అన్నదమ్ములను గురించి చర్చ సాగింది. అంతా ఆశ్చర్యపోయినా ప్రపంచపు నడకంతా అంతే అనే వాదాన్ని చాలా మంది బలపర్చారు. కొట్లాటలదాకా రాకపోయినా, అన్నదమ్ముల మధ్య రేగిన మనస్పర్థలూ, వారు వొకరినొకరిని తిట్టుకున్న తిట్లూ, యివాళ పరంధామయ్య ప్రాణావసానసమయంలో నుండగా, భీమయ్యా రామయ్యా, యింత ప్రేమానురాగాలతోటు పరంధామయ్య యింటికి రావటానికీ, వొకరినొకరు యింత ఆప్యాయంగా పలకరించుకోటానికీ, దోహదం చేసాయంటే అందరూ ఆశ్చర్యపడాల్సిన సంగతే.

పొలాలమీద వచ్చిన పంట (ఏకొద్దోగొప్పో) చూసుకుందామని భీమయ్య యీ వూరెన్నిమాట్లు వచ్చినా పిచ్చయ్యశాస్త్రిలగారింట్లో చెంబూ తప్పేలా తీసుకొని వండుకొని తినిపోయేవాడు. రామయ్యాపూటకు కారియరు తెచ్చుకునేవాడు. సాయంత్రానికే వుడాయించేవాడు. అయితే యిది

యిప్పటి మాటగాదు. పదేళ్ళక్రిందట మాట. పది సంవత్సరాలనుంచీ రామయ్యకాని భీమయ్యకాని యీ వూరు రావటమే ఎరుగరు. ఉన్న కాస్తా పదేళ్ళక్రిందటే 'షుష్'చేసుకుని ఎక్కడివారక్కడనే స్థిరపడిపోయి కష్టమో నిష్ఠూరమో, కెలో గెంజో తాగి ఎవగిమానానవారు బతుకుతున్నారు. వీరి మూడు కుటుంబాల సంగతి తెలిసిన యీ వూరి ప్రజలు పరంధామయ్య, తన యిద్దరు తమ్ముళ్ళను గురించీ ప్రస్తావికంగానైనా తలచటం ఎరగరు.

దీర్ఘమైన పదిసంవత్సరాలు దొరలిపోయిన తర్వాత వారిలో యీమాత్రమైనా అన్నగారి యెడల వాత్సల్యం ఉందనే విషయం అక్కడి ప్రజలను ఆశ్చర్యపరచదామరి! ఎప్పుడో పదిహేను సంవత్సరాల పూర్వం వీరి ముగ్గురి తల్లీతండ్రీ బ్రతికున్నప్పుడు, వీళ్లు ముగ్గురూ కొత్తకాపరాలతోటు ఆ యింట్లో అన్యోన్యంగా మెలగటం చూశారు వీళ్ళు. మళ్ళీ యివాళ్ళ ఆ యింట్లో ముగ్గురన్నదమ్ములూ, ముగ్గురు తోటికోడళ్ళూ, ప్లస్ వారి వారి పిల్లలతోటి తిరగటం చూస్తున్నారు. భీమయ్యగారికసలు పిల్లల్లేరు. రామయ్యగారికరడజనుమంది పిల్లలు. పరంధామయ్యగారికి వొక్కగానొక్క పాతికేళ్ళ విధవ కూతురు.

అన్నగారు చివరిక్షణాల్లో వుండి వొక్కసారి చూసిపోవలసిందని ఎప్పుడైతే వుత్తరాలు వ్రాశాడో, పోనీలే యికముందు చూడబోయినామా, అని తమ్ములు క్షణమాలస్యంచెయ్యకుండా వచ్చారు.

లోకులు చెప్పుకునే మాటలు నమ్మితే పరంధామయ్యగారు, తన యిద్దరు తమ్ముళ్ళను చాలా అన్యాయంచేశాడనే విషయం విదితమవుతుంది. పరంధామయ్యగారు యిద్దరు తమ్ముళ్ళకంటే ఇరవైయేళ్లు పెద్ద. పరందామయ్య మధ్యా భీమయ్య మధ్యా ముగ్గురు పిల్లలు పుట్టి పోయారట. ఇద్దరు తమ్ముళ్ళకూ ఆయనే పెళ్ళిళ్లు చేశాడు. పరంధామయ్యగారి వొక్కగానొక్క కూతురి పెండ్లి జరిగినదాకా యింట్లో తండ్రీ తల్లీ వున్నారు. ఆ తరువాత వొకయేడాదిలోనే వాళ్ళిద్దరూ శలవు పుచ్చుకున్నారు. పెద్దవాళ్ళు కాస్తా 'హరీ' అనటంతోటే పొళ్ళూ—పంపులూ, దగ్గర పోట్లాటలొచ్చినై. ఉత్తరదిశన కుంటచేను ఎకరానికి మూడుపుట్లు పండుతుంది. ఆ నాలుగెకరాల చెక్కా పరంధామయ్య తనకు తన తండ్రి వ్రాసిపోయినట్లు కాగితాలు చూపించాడు. తూర్పుదిక్కున పాటుచేను తలా రెండెకరాలూ వచ్చింది! భీమయ్యా రామయ్యా, కన్నతండ్రి అంత కానిపని చేశాడని నమ్మలేకపోయారు. పెద్దమనుషులదాకా పోయింది. దక్షిణపు దిక్కునున్న పొలం ఏ పోట్లాటా లేకుండానే పంపిణీ అయింది. కుంటచేను విషయం మార్చటానికి ఏ మాత్రం వీలులేకపోయింది. తిట్లూ దీవెనలతోటి ఆస్తి పంపిణీకాస్తా ఎట్లానో జరిగిపోయింది. అప్పు పంచుకునేటప్పటికి అగ్నిజ్వాలలు లేచి, ఆకాశమెత్తున ఆవరించుకున్నాయి. పన్నెండువేల అప్పు తేలింది. భీమయ్యా రామయ్యా పరంధామయ్య కూతురి పెళ్ళికోసం చేసిన ఆరువేల అప్పుతోటి తమకేమీ సంబంధంలేదని వాదించారు. ఉమ్మడి కుటుంబంలో జరిగిన ఖర్చుకి అందరూ బాధ్యులే కాబట్టి, అప్పును, ఆస్తిలాగానే సమయుంగా పంచుకోవాలని పరంధామయ్య వాదించాడు. కుంటచేను విషయమేమిటని భీమయ్యా, రామయ్యా గోలపెట్టారు. ఆస్తీ అప్పుల పంపకం, అలా రభసగా ఎగసి రభసగా ముగిసింది. ఆ తరువాత ఐదారు నెలలు పెద్దమనుషుల చేతుల్లో నానినాని పంపిణీలు జరిగిపోయినాయి. లంకంత కొంపలోనే మూడు భాగాలుచేసి ముగ్గురుండటం మొదలెట్టారు. అ తరువాత రామయ్య కాస్తా యేడాది తిరక్కముందే రెండెకరాలు అమ్మి రామాపురం పోయినాడు బ్రతుకుతెరువు చూసుకోటానికి. రామయ్య పోయిన తర్వాత భీమయ్యకూడా ఆట్టే ఎక్కువ కాలముండలేదు. ఉన్నట్లుండి భీమయ్యకు పిచ్చి పుట్టింది; ఊళ్లోవాళ్ళూ నోళ్ళు నొక్కుకున్నారు, చెవులు కొరుక్కున్నారు. పరంధామయ్య మందు పెట్టించాడని వొకవార్త వూరంతా వొకటే చెప్పుకుంది. భీమయ్య ఏడాదివరకూ ఎక్కడెక్కడ తిరిగాడో తెలీనే తెలీదు. భీమయ్య భార్య పుట్టింటికి పోయింది. పరంధామయ్య యీసంగతి అసలు పట్టించుకోలేదు. బయటకే రాలేకపోయాడు.

తర్వాత యేడాదికి, భీమయ్యను వాళ్ళ మామగారు వెతకి పట్టుకొని తీసుకొచ్చారు. తర్వాత మందుపెట్టి ఆస్తిని కాజేశాడని పరంధామయ్య

మీద భీమయ్య దావా వేశాడు. పరంధామయ్య తెగ ఖర్చు పెట్టాడు, తిరిగాడు. పరంధామయ్య పక్షమే గెలిచింది. భీమయ్య తన భాగం యిల్లు తాను అమ్ముకుంటానన్నాడు. ఊళ్ళో ఎవరూ కొనలేదు. ఇల్లు మళ్ళీ కట్టించుకుంటానన్నాడు. ఒకభాగం వూడదీస్తే మొత్తం వూడదీయవద్దూ! పరంధామయ్యకు ప్రాణాంతకమైంది. మళ్ళీ పెద్ద మనుషుల సాయంతో రామయ్యభాగం, భీమయ్య భాగం తానే కొనుక్కున్నాడు.

రెండేళ్ళు గడచీగడవకముందే పరంధామయ్య గారి వొక్కగానొక్క కూతురు ముండ మోసింది. పాపం కొట్టిందన్నారు వూళ్ళోని మనుషులు. పాపం, పరంధామయ్యగారు కుమిలిపోయారు. ఆ అమ్మాయి పని, "ఇదుగో పసుపు, ఇదుగో ముసుగు" అయినట్లు అయింది. అత్తారింటికి పోకుండానే, "ఆయన్ను" కాస్తా పోగొట్టుకుంది. అప్పటి నుంచి రాజమ్మ పుట్టింట్లోనే వుండిపోయింది.

* * *

పిల్లలకు అప్పటికప్పుడు వేడన్నం వండి, కంది పచ్చడి నూరి పెట్టారు. అక్కడికంటే ఇక్కడనే హాయిగా వుందనుకున్నారు వాళ్లు. భీమయ్యా రామయ్యా వేరువేరుగా వొక్కరొక్కరే వచ్చి ఏమమ్మా వొదినా, అని పెద్ద కోడలును పలకరించి పోయారు.

తరవాత సావకాశంగా భోజనాలు చేశారు. అక్కడ చేరినవారందరిలో అడుగడుగునా ఒకరిపై వొకరికి ఆప్యాయత తొణికిసలాడింది. దీర్ఘకాల వియోగానంతరం, కలుసుకునేటప్పటికి గడచిన గాథలన్నీ మనఃఫలకాల మీదనుంచి తుడిచేసుకున్నారు. తుడిచివేసుకున్నట్లు నటించారు. రాజమ్మ పిల్లలను ఆ రోజు ఎత్తుకొని తిప్పింది. పరంధామయ్యగారి ప్రాణం పోతాపోతాననేదల్లా నాల్గునాళ్లు వుందామనుకుంది. పరంధామయ్యకు కొండంత బలమొచ్చింది.

భీమయ్యా, రామయ్యా అ సాయంత్రం అన్నగారి పొలాలూ అవీ చూసొచ్చారు. విషయాలు సాకల్యంగా తెలుసుకున్నారు. రామయ్య చిన్నన్నతోటి అన్నాడు "మనంతప్ప అన్నయ్యకుమాత్రం యింకెవరున్నారు, పిల్లది పెళ్లీడు కొచ్చింది. ఏమైనా సాహం చెయ్యమని అడుగుతాను."

భీమయ్య కూడా అన్నాడు: "ఆయనాస్తిమాత్రం ఇంకెవరికిపోతుంది. ఆవిడకూ కూతురికి రాసిస్తాడు. తర్వాత వాళ్ళ బుద్ధి ఎట్లా వుంటుందీ చెప్పలేము. అంతకుముందే అన్నయ్యను కొద్దిగా కనిపెడుతుంటే మంచిది." ఇద్దరూ అన్నగారి ఆస్తిమీద యిలా ఆశలు పెంచుకున్నారు.

పరంధామయ్యకు పదిరోజుల తర్వాత జబ్బు అధికమైనది. డాక్టరును పిలుచుకురావటానికి రామయ్యా, భీమయ్యా మాట్లాడుకుంటుంటే పరంధామయ్య అన్నాడు: "ఎందుకురా శ్రమ! చిన్నవాణ్ణా చితకవాణ్ణా, అరవైయేళ్ళు నిండినయ్, ఇక బతకనులే" అన్నప్పటికీ రామయ్య బండి కట్టించుకొని వెళ్ళి డాక్టరును పిలుచుకొచ్చాడు.

కొన్నేళ్ళ క్రితం, వీళ్ళన్నదమ్ములేనా అనుకున్న ప్రజ, అన్నదమ్ములంటే వీళ్ళే అనుకోవటం మొదలెట్టింది. "ఆయనను బుజాలమీద మోస్తున్నారు. మలమూత్రాలను కూడా చీదరించుకోకుండా ఎత్తి పోస్తున్నారు. పరంధామయ్య కింకేం దిగులూ చింతా లేకుండా పోతాడు. మళ్ళా అంతా ఒకే కుటుంబమైంది" అనుకున్నారు ప్రజ.

కాస్త జబ్బుని నిమ్మళించిన తర్వాత ఒకరోజు బత్తాయిపండు వొలిచి చేతికిస్తూ రామయ్య అన్నాడు:

"చూడు అన్నయ్యా, పిల్లది పెళ్ళీడుకొచ్చింది. ఆస్తిపాస్తులు ఏమీ లేవుకదా నాకు. నీకుమాత్ర మెవరున్నారుగనుక, ఏదైనా కాస్త సాయంచెయ్యాలి."

పరంధామయ్య చిరునవ్వు నవ్వుతూ, "రోగం కుదిరి, కాస్తంత లేచి తిరగ్గలిగానా అంటే, పిల్లదాని పెళ్ళి దగ్గరుండి జరిపించనుటరా!" అన్నాడు.

భీమయ్య కూడా వోరోజు అసలు విషయం బయటపెట్టాడు. పరంధామయ్య భీమయ్యకు కూడా రామయ్యకు లాగే చిరునవ్వు నవ్వుతూ అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లుగా సమాధానం చెప్పాడు.

నెలా పదిరోజు లిలా గడచీ గడవకముందే రంగంలో చిన్న తరంగం లేచింది. అందు మూలంగా రెండో తోడికోడలికి, పెద్దకోడలికీ స్పర్థలు కలిగినయ్. గాదెచాటున గింజలు కొలుస్తూ జీతగాడు రాజమ్మమీద చెయిచేసుకుంటూ మోటు సరసమాడుతుంటే చూసింది. రెండో

తోటికోడలు వచ్చినప్పటినుంచీ యీవుదంతం అడపాదడపా చూస్తూనేవుంది. ఇవాళ ఆమె సహించలేదు. రాజమ్మను గట్టిగా చీవాట్లుపెట్టింది. రాజమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకొని ఆవిడ ఇంతింతలేసి మాటలంది, అని తల్లితోటి చెప్పింది. "ఏమిటమ్మా, ఏమిటేమిటో అన్నావుట? నా కూతురు రంకు సాగిస్తున్నాదా? నీ చెల్లెలేంచేసింది"—ఇలాగా వాగ్వాదం పెరిగింది. పెద్దకోడలు పరంధామయ్య దగ్గరకెళ్ళి చూశారా, ఏమండోయ్, మీామరదలు ఇలా యిలా అన్నది, ఈ ఇంట్లో నే వుండలేను బాబోయ్, అని రాగాలు తీసింది. రెండో ఆవిడొచ్చి మనం వెళ్ళిపోదామండీ, చేసిన చాకిరీ చాలును అని భీమయ్యతోటి మొరపెట్టుకుంది. పూర్వమయితే పరంధామయ్యా, భీమయ్యా ఎవరి భార్యలను వారు వెనకేసుకొని యిద్దరూ పోట్లాడుకునేవారు. ఇప్పుడు ఇద్దరూ తమతమ అర్థాంగులకు హితబోధ చేశారు. పడుచు జీతగాడు పడమటింట్లోకి రావటంలేదు. గొడ్లసావిట్లోకి రాజమ్మ పోవటంలేదు.

అన్నదమ్ములు మరీ శ్రద్ధగా చూడటం మొదలెట్టారు అన్నను. ప్రొద్దుటనే భీమయ్యవచ్చి లేవదీసి మొహమూా అదీ కడిగి పక్కమార్చి పోయేవాడు. రామయ్యవచ్చి కాఫీయిచ్చి, తరువాత గంట గంటకూ మందు కలిపిచ్చి పోయేవాడు. తోటికోడళ్ళు పూర్వపంతటి ఆప్యాయత చూపుకోక పోయినా, ముభావంగా ఎవరిపనులు వారు చేసుకుంటున్నారు.

పరంధామయ్యకు వుధృతంగా గుండె పోటు వచ్చింది. డాక్టరును పిలుచుకొచ్చాడు రామయ్య. డాక్టరు పెదవివిరిచాడు. భీమయ్యా రామయ్యా వొదినెదగ్గరకు పోయి "విల్లురాయించవద్దుటమ్మా" వదినా అన్నారు. పెద్ద తోటికోడలు మాట్లాడలేదు. ఊళ్ళోని జనమంతావచ్చి చూసిపోతున్నారు. భీమయ్యకూ రామయ్యకూ, ఆత్రుత ఎక్కువైంది. "విల్లు యిదివరకే రాశారుగా"అంది పెద్ద తోటికోడలు. రామయ్యా భీమయ్యా కుప్ప కూలిపోయారు. పరంధామయ్య ప్రాణాలు పంచభూతాల్లో కలసిపోయినాయి. "తన భార్యకు దత్తతచేసుకునే అధికారమిస్తూ సగమాస్తి భార్యకు, తక్కినదాంట్లో సగం దత్తుడికి, తక్కినది కూతురికి" రాసిచ్చి పోయాడు పరంధామయ్య. దగాపడ్డ తమ్ములు వీలునామాచూసుకొని దిగాలుపడ్డారు.

కథానిక

# కలకాలంలో శ్రీహరి

"ఖాస్కరం - ప్రభాకరం"

""కథంతా విన్నతరువాత అబ్సర్డ్ అనకండి. నమ్మితే నమ్మండి: లేకపోతేలేదు. ఈ ప్రపంచంలో ఏదీ అసంభవంకాదు ఆ మాటకొస్తే" అని కంఠశోషపడుతున్నాడు శేషు.

"నమ్ముతాం, చెప్పరాబాబూ, చంపక" అని మొత్తుకున్నాడు టార్జాన్.

"నిసలైన శ్రోతవంటే నువ్వురా" అని వాణ్ణి మెచ్చుకున్నాడు శేషు.

శేషు చెప్పిన కథ సారాంశం యిది—

* * *

క్రాన్‌వర్డ్ పజిల్సువచ్చి చాలాకాలం అయినా ఇంత జగత్ప్రసిద్ధి ఎప్పుడూ పొందలేదు. ప్రతీవీధి చివరా కాష్ రసీదులు అమ్మేసెంటరూ, ఒకపెద్ద కర్రపెట్టె—ఇందులో వేస్తారు సమాధానాలు——. ప్రతివాడి చేతులో వొకపజిలు.

"ఇంత జూదపు తత్వం సమాజంలో ఎలా బయలుదేరింది?" అనే విషయంలో తర్జనభర్జనలు పడుతున్నారు వాటర్ లిలీ క్లబ్బు మెంబర్లు.

డబ్బు వుత్తినేవొచ్చి తమ ముందు వాలాలనే కోరిక మాత్రమే జూదానికి ఆధారమని అంతా నిర్ణయం చేసుకున్నారు. ప్రతివాడూ తను ఇన్ని సార్లుగా సొల్యూషన్స్ పంపడం, డబ్బుపోవడమే గాని రావడం ఎప్పుడూ ఎరగకపోవడం గురించి బల్లగుద్ది లెక్చరిచ్చి ఇది కూడదన్నాడు. ఇది సామాన్య మానవుడి జీవితానికి అవరోధం అని నొక్కి వక్కాణించి, ఇక నెవరూ ఎప్పుడూ వీటికి